ప్రజాశక్తి

శనివారం 16 సెప్టెంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



నేటి నుంచి మున్సిపల్ సమ్మె

నిలిచిపోనున్న పలు సేవలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగర పాలకులు మాట తప్పారు. ఏడు వేల మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారు. హెల్త్ అలవెన్సులు, కనీస వేతనాలు, జీతాలు సక్రమంగా ఇవ్వకుండా నెలల తరబడి కార్మికుల పొట్టగొడుతున్నారు. ఈ ఏడాది జూన్ 16న జివిఎంసి అధికారులతో జరిగిన ఒప్పందాన్ని ఆగస్టు 31లోపు అమలు చేస్తామని చెప్పి విస్మరించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో శనివారం నుంచి కార్మికులు సమ్మె బాట పడుతున్నారు.

ఒప్పందంలో ఏముంది ?

జివిఎంసి పరిధిలో విధులు నిర్వహిస్తున్న నీటి సరఫరా, యుజిడి, వెటర్నరీ, మలేరియా, పారిశుధ్యం, క్లాప్ డ్రైవర్లు సహా సెక్షన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌కు సంబంధించి ఏడు వేల మంది ఉంటారు. అనాదిగా వస్తున్న వారసత్వ పోస్టులను కార్మికుల బిడ్డలకే ఇవ్వాలని, బయటకు అమ్ముకో కూడదని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500ను మిగతా 2లో..



కార్మికులతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రి బూడి

సిఎం జగన్‌కు ఘన స్వాగతం, వీడ్కోలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయనగరం జిల్లాలో ఒకరోజు పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉదయం 9:45 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ప్రభుత్వ మిగతా 2లో..



ధ్రువీకరణ పత్రాన్ని ప్రదర్శిస్తున్న ప్రొఫెసర్ శ్రీసుధ, తదితరులు

ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు ధ్రువీకరణ పత్రం

ప్రజాశక్తి - సబ్బవరం : దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఇంటెలెక్చువల్ రైట్స్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు వచ్చేందుకు విశ్వవిద్యాలయ సెంటర్ మూడేళ్లుగా మిగతా 2లో..





కరువు జిల్లాగా ప్రకటించండి

▶ వార్త 5లో..

ఘనంగా వైశాఖి నృత్యోత్సవం

▶ వార్త 2లో..



ఘనంగా వైశాఖి నృత్యోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన మూడు రోజులపాటు తలపెట్టిన వైశాఖీ నృత్యోత్సవం శుక్రవారం సాయంత్రం మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమైంది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకులు బత్తిన రంగ విక్రమ్ కుమార్ గౌడ్ నిర్దేశకత్వంలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ఉత్సవాన్ని అతిథులు ఆదాయ పన్నుల శాఖ మాజీ కమిషనర్ సూదగాని రవిశంకర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఐలాపురం రాజా, అనకాపల్లి ఎస్‌పి కెవి.మురళీకృష్ణ, ఆదాయ పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శంకర్ పాండే, కేంద్ర పన్నుల సంయుక్త కమిషనర్ ఎన్.మహ్మద్ ఆలీ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి ప్రభృతులు లాంఛనంగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. న్యూ ఢిల్లీకి చెందిన కథక్ నాట్య నిపుణులు పద్మశ్రీ అవార్డు గ్రహీతలు నళిని, కమలిని సోదరీమణుల ద్వయం చక్కటి నృత్యం ప్రదర్శించి ఈ ఏటి నృత్యోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత డాక్టర్ కె.శోభానాయుడు నృత్య పరికల్పన చేసిన కూచిపూడి సంప్రదాయ నృత్యాంశం స్వాగతం కృష్ణాను విశాఖపట్నానికి చెందిన సూదగాని గీతా నారాయణ్ రసరమ్యంగా ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నారు. ద్వితీయాంశంగా డాక్టర్ వెంపటి చిన సత్యం నృత్యపరికల్పన చేసిన కామాక్షి స్తుతి చక్కగా ప్రదర్శించి ఆహా అనిపించుకున్నారు. దుబాయికి చెందిన యువ కూచిపూడి నర్తకి శ్రావణి తెన్నేటి శ్రావణి నీలాంబరి రాగం/ఆదితాళంలో శృంగార లక్ష్మి.. అంశాన్ని రసరమ్యంగా ప్రదర్శించి ఆహూతుల మెప్పు పొందారు. పెద్ద సంఖ్యలో వీక్షకులు ఈ ఉత్సవాలకు హాజరయ్యారు.



కళాకారిణిని సత్కరిస్తున్న విక్రమ్ గౌడ్ తదితరులు

మొదటి పేజీ తరువాయి..

నేటి నుంచి మున్సిపల్ సమ్మె

నేటి నుంచి జరిగే సమ్మెలో పాల్గొనేవారు : 7 వేల మంది
వారిలో పారిశుధ్య కార్మికులు : 5025
మలేరియా విభాగం : 50
వెటర్నరీ : 60
డ్రైవర్లు : 214
వాటర్ సప్లయ్ : 1000
క్లాప్ డ్రైవర్లు : 700
పార్కుల కార్మికులు : 30 మంది

జిఒ 7 ప్రకారం చెల్లించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని వారంతా గతంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. డ్రైవర్లు, వెటర్నరీ, మలేరియా, యుజిడి కార్మికులకు హెల్త్ అలవెన్సులు చెల్లించాలని, నగర ప్రజల సేవలకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని పలుమార్లు నగర కమిషనర్లు, సంబంధిత అధికారులకు వినతులు సమర్పించారు. అయినప్పటికీ వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఇదిలా ఉండగా 300 పోస్టులు ఇటీవల అమ్ముడుపోయినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ విషయమై దర్యాప్తు చేయాలని అత్యధిక మంది జివిఎంసి కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఒప్పందంలో భాగంగా పలు డిమాండ్లను నెరవేరుస్తామంటూ అధికారులు రాతపూర్వకంగా అంగీకరించి ఆనక ఉల్లంఘించడంపై మండిపడుతున్నారు.

అనివార్య పరిస్థితుల్లోనే సమ్మెకు..

సమస్యలకు ఎటువంటి పరిష్కారమూ దొరక్క కార్మికులు అనివార్యంగా సమ్మెలోకి వెళ్తున్నారు. 'ఈ ఏడాది జూన్ 2న సమ్మె నోటీస్ ఇచ్చాం. అదే నెల 19 నుంచి సమ్మెలోకి వెళ్లాలనుకున్నాం. అధికారులు హుటాహుటిన రెండు రోజులకు ముందే 16న చర్చలకు పిలిచారు. ఒప్పందం జరిగింది. పైన తెలిపిన డిమాండ్లలో చాలా వరకూ ఆగస్టు 31 నుంచి అమలు చేస్తామని రాతపూర్వక హామీ ఇచ్చారు. దాన్ని పాలకవర్గం, అధికారులు ఉల్లంఘించారు. దీంతో కార్మికుల్లో ఆందోళన తీవ్రమైంది. హెల్త్ అలవెన్స్ ఇవ్వకుండా వేలాది మంది పారిశుధ్య కార్మికులతో చాకిరీ చేయించుకుంటున్నారు. వాస్తవానికి ఈ జూన్ 2 నాటి నోటీసు ఏడాది వరకూ అమల్లో ఉంటున్నా సరే 14 రోజుల ముందు మరలా నోటీసు ఇచ్చి ఈ నెల 16 నుంచి సమ్మెలోకి దిగుతున్నాం. ఇది చట్టబద్ధ సమ్మె' అని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పెతకంశెట్టి వెంకటరెడ్డి తెలిపారు.

సిఎం జగన్‌కు ఘన స్వాగతం, వీడ్కోలు

విప్ కరణం ధర్మశ్రీ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, సిపి రవి శంకర్, జెసి కెఎస్.విశ్వనాథన్, ఎంపీలు ఎంవివి.సత్యనారాయణ, బి.సత్యవతి, జి.మాధవి, డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు, శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎపి మార్కెటింగ్ బోర్డు ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం సిఎం ఇక్కడి నుంచి విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉదయం 10:00 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 2.20 గంటలకు చేరుకోగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన వీడ్కోలు పలికారు.

ఆత్రేయపురం పూతరేకులకు
భౌగోళిక గుర్తింపు ధ్రువీకరణ పత్రం

చేసిన కృషి ఫలించినట్లు ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీ సుధ తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీలో శుక్రవారం జరిగిన ఓ జాతీయ సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ క్రమంలో ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు లభించిన సందర్భంగా ధ్రువీకరణ పత్రాన్ని ఆత్రేయపురం పూతరేకుల ఉత్పత్తిదారుల సంఘం వారికి అందజేశారు. ఈ కార్యక్రమానికి ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఎక్స్‌పర్ట్, జెఎన్‌టియు ప్రొఫెసర్ ఉన్నత్ పి.పండిట్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో విసి శ్రీ సుధా మాట్లాడుతూ దేశీయ ఉత్పత్తులు కొన్ని ప్రాంతాల ప్రసిద్ధి అని, వాటిని తయారు చేయడంలో ఆ ప్రాంతవాసులు మాత్రమే నైపుణ్యం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 30 రకాల ఉత్పత్తులను గుర్తించామని, ఆయా ఉత్పత్తులకు కూడా భౌగోళిక గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. భౌగోళిక గుర్తింపు తెచ్చే వాటిలో భాగంగా మాడుగుల హల్వాకు పనిచేసేందుకు ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ డిపార్ట్మెంట్ వారితో విశ్వవిద్యాలయం ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భౌగోళిక గుర్తింపు సంస్థ ప్రతినిధి, గవర్నమెంట్ అడ్వకేట్ సంజయ్ గాంధీ, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ డిపార్ట్మెంట్ ప్రతినిధి మారుతి, ఆత్రేయపురం పూతరేకులు ఉత్పత్తిదారుల సంఘం ప్రెసిడెంట్ రామరాజు, జి.ప్రసాదరాజు, ఇతర సభ్యులు, మోదకొండమ్మ తల్లి మాడుగుల హల్వా తయారీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా పోటీపై ఆలోచిస్తా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ లోక్‌సభ స్థానం నుంచి రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఆలోచిస్తానని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శాశ్వత ఆహ్వానితులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఆయన జన్మదిన వేడుకలు సిరిపురంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర విభజనకు కాంగ్రెస్ పార్టీయే కారణమన్న భావన అంతటా వ్యక్తమైందని, వాస్తవానికి అన్ని పార్టీలూ కోరిన మీదటే రాష్ట్ర విభజన జరిగిందని తెలిపారు.

20వ వార్డులో అన్నదానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 20వ వార్డులో జరిగిన అన్నదాన కార్యక్రమంలో శుక్రవారం విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ పాల్గొన్నారు. వైసిపి వార్డు సీనియర్ నాయకులు పి.ప్రసాద్ రెడ్డి మాతృమూర్తి మూడో వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఓలా, ఉబర్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఓలా, ఉబర్ ఆన్ లైన్ క్యాబ్‌లలో డ్రైవర్లుగా తిరుగుతున్న వారికి అన్యాయం చేయటం దుర్మార్గమని, యాజమాన్యం రేట్లు తగ్గించినప్పటికీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోదని విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షుడు బి.జగన్ ప్రశ్నించారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓలా, ఉబర్ యాజమాన్యం ఆన్‌లైన్ యాప్ పెట్టి విశాఖపట్నంలో ఉన్న సుమారు 4 వేల మంది క్యాబ్ డ్రైవర్లను వారి యాప్‌లో జాయిన్ చేసుకుని మోసపూరిత విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. సమస్యలపై జూన్ 20న విశాఖపట్నంలో ఉన్న క్యాబ్ డ్రైవర్లందరూ చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టి వినతిపత్రం అందజేయగా డిటిసి, లేబర్ డిపార్ట్‌మెంట్ వారు కలుగజేసుకున్నారన్నారు. అయినప్పటికీ ఓలా, ఉబర్ యాజమాన్యాలు సమస్యలను పరిష్కరించకుండా ఉన్న రేట్లును తగ్గించారన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం నడుపుతున్న క్యాబ్ యాప్ వంటిది మన రాష్ట్రంలో కూడా తీసుకురావాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉబర్ రిప్రజెంటీవ్‌గా ఉన్న యస్వంత్‌ను ఇక్కడ నుంచి తొలగించి డ్రైవర్లకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోలినాయుడు, ఆఫీస్ బేరర్స్ శ్రీను, శరత్, ఆనంద్ పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ బిఎం.దివాన్ అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విశాఖ జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు.

ప్రవేశ రుసుముల చెల్లింపులు డిజిటలైజేషన్

ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ పరిధిలో నిర్వహిస్తున్న పార్కులు, మ్యూజియాల్లో ప్రవేశ రుసుముల చెల్లింపులను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు.

స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీకి 21న విమ్స్‌లో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(విమ్స్) ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న 43 స్పెషలిస్టు వైద్యుల పోస్టులకు భర్తీకి ఈనెల 21న విమ్స్ ఆసుపత్రిలో వాక్ఇన్ ఇంటర్వ్యూకు నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డిఎంఈ డాట్ ఏపీ డాట్ ఎస్ఐవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ ఇంటర్వ్యూలు 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఏపి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళగిరి అధికారుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. భారీ వేతనంతో వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్న నేపద్యంలో మంచి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులకు రూ. ఒకలక్ష 60వేలు, జనరల్ స్పెషాలిటీ వైద్యులకు రూ.92వేలు జీతం ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఫుడ్ విజిలెన్స్ కమిటీ సభ్యునిగా సన్యాసిరావు



జెసి నుంచి నియామక పత్రం అందుకుంటున్న బోగాది

ప్రజాశక్తి -గాజువాక : జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని విశాఖ జిల్లా ఫుడ్ విజిలెన్స్ కమిటీ సభ్యునిగా నాతయ్యపాలేనికి చెందిన బోగాది సన్యాసిరావును నియమిస్తూ కలెక్టర్ మల్లికార్జున శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసారు. నియామకపత్రాన్ని జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్, డిఎస్ఒ జి.సూర్యప్రకాష్ అందజేశారు. ప్రస్తుతం ఎపి సివిల్ సప్లై డైరెక్టరగా బాధ్యతలు నిర్వహిస్తున్న సన్యాసిరావుకు ఫుడ్ విజిలెన్స్ కమిటీ సభ్యునిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఉన్నతాధికారులకు సన్యాసిరావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు, జంక్ ఫుడ్స్‌తో జాగ్రత్త

ప్రజాశక్తి-పెందుర్తి : ప్లాస్టిక్ వ్యర్థాలు, జంక్ ఫుడ్స్‌తో యువత జాగ్రత్తగా ఉండాలని రవికుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో జివిఎంసి ఆధ్వర్యంలో యూత్ వర్సెస్ గార్బేజ్ అవగాహన సదస్సు నిర్వహించారు. యువత రోడ్డు పక్క ఫాస్ట్‌ఫుడ్స్‌కు అలవాటుపడి, ప్లాస్టిక్‌పాత్రలు, సిలికాన్ స్పూన్స్‌తో వేడి పదార్థాలను తినడం వల్ల సింథటిక్ పాలిప్స్, పేగుల్లో కేన్సర్ వంటి వ్యాధులతో మనిషి ఆరోగ్యాన్ని నాశనంచేస్తున్నాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆదర్శ డిగ్రీ కళాశాల సెక్రెటరీ టి.తియోఫిలస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బదులుగా ప్రకృతి సిద్ధమైన పాత్రలు, సంచులు వాడాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆఫీసర్ డాక్టర్ జె కృష్ణంరాజు, శానిటరీ సూపర్వైజర్ కె.వి రమణ, శానిటరీ ఇన్స్పెక్టర్ గౌరీ నాయుడు, ఆదర్శ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మంజుల, గౌతమ్ బాబు ,కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఇ. ఫ్లోరాఅచ్చమ్మ పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై 'గీతం' వర్క్ షాప్

ప్రజాశక్తి -మధురవాడ : ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి)పై గీతం డీమ్డ్ వర్సిటీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు సభ్యులుగా గల కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఎల్అండ్‌టి ల్యాబ్ వ్యవస్థాపకుడు కె.ప్రమోద్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు ఐఒటి మెళకువలను వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఐఒటి ద్వారా వివిధ రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయన్నారు. గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష మాట్లాడుతూ. ఐఒటిలో ఉన్న విస్తృత ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే, విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డాక్టర్ జి. శ్రీనివాస్, ఎస్.మోహనకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

'భారతరత్న' మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘననివాళి

ప్రజాశక్తి -మధురవాడ : సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి, ఇంజినీర్స్‌డే వేడుకలను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశ్వేశ్వరాయ భవన్‌లో నిర్వహించారు. విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్ రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, కంప్యూటర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ సి. విజయశేఖర్, ఎరిక్సన్ డేటా సైన్స్ డైరెక్టర్ డాక్టర్ వి.సునీల్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ముకుంద్,తదితరులు పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

తగరపువలస: భీమిలి మండలం, సింగనబంద పంచాయతీ, కృష్ణరాజుపేట ఎంపిపి పాఠశాల లో ఇంజినీర్స్ డే నిర్వహించారు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను పాఠశాల హెచ్ఎం గొట్టిపల్లి సత్య నారాయణ కొనియాడారు

ఆనందపురం : మండలంలోని నీళ్లకుండీలు వద్ద శ్రీసాయి స్వామి వివేకానంద పాఠశాలలో ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని మోక్షగుండం విశ్వేశ్వరయ



గీతంలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఘననివాళులు



జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను సత్కరించిన మేయర్ గొలగాని

చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్కూల్ డైరెక్టర్ శర్మ, ఉపాధ్యాయుల,పాల్గొన్నారు.

పరవాడ : గొన్న ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా టాపర్‌గా నిలిచిన విద్యార్థులతో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ చేయించారు. విద్యార్థులకు ఎలోక్యూషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ఎస్సే రైటింగ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, మోడల్ ఎక్స్పో వంటి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హెమచంద్ నాయుడు, ప్రిన్సిపల్ పిఎస్ఎన్ మూర్తి, పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ప్రగతికి పునాదులు ఇంజనీరే అని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శుక్రవారం ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజినీరింగ్ పితామహుడు విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించు కుని జివిఎంసి ఇంజినీర్లను సన్మానించారు.

వేపగుంట: నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజనీర్స్‌డే సందర్భంగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి జివిఎంసి ఇఇ తారాప్రసన్న పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కళాశాల విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీధర్‌పట్నాయక్, సివిల్ విభాగాధిపతి వి.భార్గవి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవల విస్తృతి లక్ష్యం: డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆరోగ్య సేవలు విస్తృతికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఐదు విడతలుగా కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తున్నామని డిఎంహెచ్ఓ డాక్టర్.పి.జగదీశ్వరరావు తెలిపారు. మొదటి విడతలో ఈనెల 15 నుంచి వాలంటీర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటిసర్వే నిర్వహం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించి, ఏ అనారోగ్య సమస్యకు ఏ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు వెళ్లాలి, అక్కడ అందించే ఉచిత వైద్యసేవలను ఎలా వినియోగించుకోవాలనే దానిపై వివరిస్తారన్నారు. అనంతరం సిహెచ్ఒ, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తల బృందం ఇంటింటికీ వచ్చి ప్రజలకు ఇంటివద్దే బిపి, సుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, స్ఫూటం పరీక్షలతో పాటు జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా, డెంగీలాంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించి, ఫలితాలను మొబైల్‌యాప్‌లో నమోదు చేస్తారన్నారు. అనంతరం ప్రతి ఇంటికీ, రోగికీ ఒక కేస్‌షీట్ జనరేట్ చేస్తారని, ఈ డేటా వివరాలు హెల్త్ క్యాంపు నాటికి ఉపయోగపడతాయన్నారు. హెల్త్‌క్యాంపు నిర్వహణకు మూడు రోజుల ముందు వాలంటీర్, గృహసారథులు మరోమారు ఆయా ఇళ్లకు వెళ్ళి హెల్త్‌క్యాంపుపై సమాచారమిస్తారన్నారు. హెల్త్‌క్యాంపులు ఈనెల 30న ప్రారంభమౌతాయని, ప్రతిరోజూ మండలంలోని ఏదైనా గ్రామంలో నిర్వహిస్తారని, ఇలా పట్టణపరిధిలో 58, గ్రామాల్లో 54 క్యాంపులు నిర్వహిస్తారన్నారు. విలేజ్ క్లినిక్, అర్బన్ హెల్త్ సెంటర్ యూనిట్‌గా తీసుకుని జిల్లా వ్యాప్తంగా 45రోజులపాటు నిర్వహించే హెల్త్‌క్యాంపులకు 31మంది గైనకాలజిస్టులు, 18మది పీడియాట్రిషియన్స్, 41మంది జనరల్ మెడిసిన్ స్పెషలిస్టులు, మరో 31మంది ఇతర వ్యాధులకు సంబంధించి వైద్యనిపుణులు, 31మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్స్, యుపిహెచ్‌సి, పిహెచ్‌సిల నుంచి 83మంది వైద్యాధికారులు, 554 మంది ఎఎన్ఎంలు, 885 మంది ఆశా కార్యకర్తలు బృందాలుగా పాల్గొంటారని,54 మంది సిహెచ్ఒలు పర్యవేక్షణాధికారులుగా వ్యవహరిస్తారన్నారు. గ్రామీణ, పట్టణప్రాంతాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతిఒక్కరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిఎంహెచ్ఒ వెల్లడించారు.

మందుల కొరత లేకుండా చూడాలి

సీతమ్మధార : జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నేతలు కోరారు ఈ మేరకు డిఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు మాట్లాడుతూ పలు కాలనీల్లో సీజనల్ వ్యాధులతో పేదప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వైద్యానికి ప్రభుత్వాసుపత్రికి వస్తే మందులు బయట కొనుక్కోమని చీటీలు రాసిస్తున్నారన్నారు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదని, అవసరమైన మందులను



డిఎంహెచ్ఒకు వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నేతలు

అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యసేవలు అందించే చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రావణ్, నాయకులు శరత్,రామస్వామి పాల్గొన్నారు.

గీతం విద్యార్థుల గ్రీన్ వాక్‌థాన్

ప్రజాశక్తి -మధురవాడ : హరిత కట్టడాలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి) పిలుపుమేరకు గ్రీన్‌వీక్ వారోత్సవాల ముగింపు సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో శుక్రవారం అధ్యాపకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రీన్ వాక్‌థాన్ నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ విభూతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన జీవనవిధానాన్ని అనుసరించాలని, కర్బన ఉద్గారాలను తగ్గించే విధంగా హరిత కట్టడాలకు ప్రాధాన్యతనివ్వాలని పిలుపునిచ్చారు.

జనసేన, టిడిపి పొత్తు అవసరం : పల్లా

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర భవిష్యత్, ప్రజల ప్రయోజనానికి తెలుగుదేశం జనసేన పొత్తు చారిత్రాత్మక అవసరమని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం గాజువాకలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రం, ప్రజల విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేక కలిసి వెళతాయని పవన్‌కల్యాణ్ చెప్పడం శుభసూచకమన్నారు. జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించేందుకు జనసేన అధినేత తీసుకున్న నిర్ణయం హర్షనీయమన్నారు. టిడిపి, జనసేన నేతలు, కార్యకర్తలు సమిష్టిగా వైసిపి దుష్టపాలనను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, బొండా జగన్, పల్లా శ్రీనివాసరావు, గాజువాక ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాసరావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి పుచ్చ విజయకుమార్. గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి సుబాకర్ సాహు, గంతోకోరు అప్పారావు, కరణం సత్యారావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక: ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని జివిఎంసి ఎడిసి సన్యాసిరావు కోరారు. 87వ వార్డులో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దోమలను తద్వారా డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు వారానికోరోజు డ్రైడే పాటించాలన్నారు. తడిపొడి చెత్తను వేరుచేసి జివిఎంసి పారిశుధ్య సిబందికి అందించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, నీటి వనరులను సంరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించాలని కోరారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో 87వ వార్డునగరంలోనే టాప్‌లో ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్‌సి పి.సింహచలం, ఎంఎహెచ్ఒడాక్టర్ కిరణ్‌కుమార్, వార్డు వైసిపి అధ్యక్షుడు బొడ్డ గోవింద్, కోమటి శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు, చిత్రాడ రమణ, నాగరాజు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, వార్డు స్పెషలాఫీసర్ ప్రకాష్, మూర్తి, క్రీ అంజి పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు సంతోష్ నగర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆడారి ఆనందకుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, జివిఎంసి అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీంతో వార్డు వైసిపి అధ్యక్షుడు అయితంశెట్టి రేణుక గోపాలకృష్ణ (గోపి), సంబంధిత అధికారులతో కలసి జెసిబితో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను శుక్రవారం తొలగించారు పిఎసిఎస్ ఛైర్మన్ ఆళ్ల పైడిరాజు, గవరనాయుడు పాల్గొన్నారు.

పూర్వ డిఆర్ఎమ్‌కు సత్కారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : భవిష్యత్తులో దువ్వాడ రైల్వే స్టేషన్ మరింతగా అభివృద్ధి చెందుతుందని వాల్తేరు డివిజన్ పూర్వ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ శతపతి అన్నారు. సిటిపియంగా ప్రమోషన్ పొంది కలకత్తా రైల్వేడివిజన్‌కు బదిలీపై వెళ్తున్న ఆయనను రైల్వేహౌస్‌లో దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కంచుమూర్తి ఈశ్వర్, వి. జాషువా, కె. వీర్రాజు, ఎంఎస్.ఎన్ మూర్తి ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

తూనికల్లో మోసం : నాలుగు దుకాణాల సీజ్

ప్రజాశక్తి -ఆనందపురం: వేములవలస మహాత్మాగాంధీ పూలమార్కెట్‌లో తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడిన నాలుగు దుకాణాలను ఆ శాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. తూనికలు కొలతల్లో మోసాలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో ఆ శాఖ ఉన్నతాధికారి మనోహర్ ఆదేశాలతో విస్తృత తనిఖీలు చేసి, నలుగురిపై కేసు నమోదు చేశారు. తూనికల్లో అక్రమాలు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్.వి.రమణమూర్తి, చిన్నమ్మ, ఉమా సుందరి, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సమాచార కమిషనర్

ప్రజాశక్తి- సింహచలం : సింహాద్రి అప్పన్నను శుక్రవారం రాష్ట్ర సమాచార కమిషనర్ ఇల్లంపు రాజా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

రేపు తెలుగుశక్తి ఆత్మగౌరవ సభ

ప్రజాశక్తి -తగరపువలస : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ అరాచక పాలనను నిరసిస్తూ తెలుగుశక్తి ఆధ్వర్యంలో ఈ నెల 17న, విశాఖ ఆర్‌కె బీచ్ లో ఆత్మగౌరవ బహిరంగసభను జయప్రదం చేయాలని తెలుగుశక్తి అధ్యక్షులు బివి రామ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, రాజకీయ కక్షతోనే చంద్రబాబును అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రావడం తథ్యమని స్పష్టం చేశారు. త్వరలో వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు ప్రారంభమౌతాయన్నారు.

243 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని ఆర్‌వి.పురం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 243మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎస్‌ఒఎస్ ఆర్గనైజర్ మేనేజర్ దుర్గరాజు ఆధ్వర్యంలో విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో డాక్టర్ తరుణ్, డాక్టర్ దినేష్, ఇతర సిబ్బంది రోగులకు ఇసిజి, రక్తపరీక్షలు, ఇతర వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సిబ్బంది శ్యామల, ఆదిలక్ష్మి, జానకి పాల్గొన్నారు

జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెం గ్రామంలో రూ.8.20లక్షలతో జలజీవన్ మిషన్ కుళాయి పనులకు శుక్రవారం స్థానిక ఎంపిపి రాంబాబు శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు ద్వారా తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి పంచాయితీ వెంకటాపురంలో జలజీవన్ మిషన్‌లో రూ.16లక్షలతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ గంటా జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయా పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు బంటుపల్లి సూరినాయుడు, ఇల్లాపు వెంకటరావు కోరాడ శ్రీను, బుత్తల ఆదినారాయణ పాల్గొన్నారు

సమస్యలపై జనసేన పోరాటం

ప్రజాశక్తి -గాజువాక : నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలపై జనసేన పోరాటం చేస్తుందని, ఆ పార్టీ నేత కోన తాతారావు అన్నారు. శుక్రవారం గాజువాకలో విలేకర్లతో మాట్లాడుతూ, గడచిన నాలుగున్నరేళ్లలో గాజువాకలో ఒక్క సమస్య అయినా పరిష్కారం కాలేదన్నారు. పొత్తులపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వైసిపి నేతల్లో గుబులు పట్టుకుందని, అందుకే అమ్ముడుపోయారంటూ కువిమర్శలు చేస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి అరాచక పాలనకు చెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని, దీనిపై త్వరలో మరిన్ని నిర్ణయాలు వస్తాయన్నారు. ఆంధ్రా ప్రజలు కోరుకున్న పాలన త్వరలో అందిస్తామంటూ టిడిపితో పొత్తుపై పవన్‌కల్యాణ్ చారిత్రక నిర్ణయం తీసుకున్నారని, దీనిపై అన్ని వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయన్నారు.

ఘనంగా ఎంవివి జన్మదిన వేడుకలు



చీరలు పంపిణీ చేస్తున్న ఎంపి ఎంవివి సత్యనారాయణ తదితరులు)

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఎంపి, తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 10వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్ల అప్పలరాజు ఆధ్వర్యంలో రవీంద్రనగర్ జయ ఫంక్షన్ హాల్‌లోనూ, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కె.రామన్న పాత్రుడు ఆధ్వర్యంలో రవీంద్రనగర్, ఎస్‌జజి నగర్‌లో నిర్వహించారు. జయఫంక్షన్ హాల్లో 200 మందికి, ఎస్‌జజి నగర్, వివేకానందనగర్‌లో వంద మందికి చీరలు పంపిణీ చేశారు. వివేకానందనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేసారు. కార్యక్రమంల్లో వైసిపి మహిళా అధ్యక్షురాలు కృపా జ్యోతి, బొండా శ్రీనివాస్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, పతివాడ కనకరాజు, ఒమ్మి శ్రీను పాల్గొన్నారు.

ఉక్కు రక్షణ యాత్రను జయప్రదం చేయండి



బైక్‌యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అయోధ్యరాం, కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు రక్షణకు ఉత్తరాంధ్ర బైక్ యాత్రను జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్టీల్‌ప్లాంట్ స్టోర్ జంక్షన్ వద్ద బైక్ యాత్ర గోడపత్రులను స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జె అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి బైక్‌యాత్ర జరుగుతుందన్నారు. 1050 కిలోమీటర్లు ప్రయాణించి, ఈనెల 29న స్టీల్‌ప్లాంట్ రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద ముగుస్తుందన్నారు.

స్టీల్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ప్రజా ఉద్యమాల ద్వారానే మార్చడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

స్టీల్ ఐఎన్‌టియుసి అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ అందరి కర్తవ్యం కావాలన్నారు. బైక్‌యాత్ర జయప్రదంతో ఉద్యమ బలోపేతం అందరి బాధ్యతగా పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు రామస్వామి, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు జె రామకృష్ణ, రమణమూర్తి, గణపతి రెడ్డి, డివి రమణారెడ్డి, డి సురేష్‌బాబు, సిహెచ్ సన్యాసిరావు, వరసాల శ్రీనివాస్, కరణం సత్యారావు, నమ్మి సింహాద్రి, తాడికొండ జగదీష్, శ్రీనివాసులు నాయుడు, స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, నీలకంఠం, బి ఎస్ మధుసూదన్ పాల్గొన్నారు.

22 నుంచి 'వైభవ్ జ్యూయలర్స్ పబ్లిక్ ఆఫరింగ్'



కార్యక్రమంలో పాల్గొన్న వైభవ్ జ్యూయలర్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ భారతదేశంలోని ప్రముఖ ప్రాంతీయ ఆభరణాల బ్రాండ్ వైభవ్ జ్యువెలర్స్ ప్రగతి పథాన దూసుకుపోతోంది. ఈ క్రమంలోనే సంస్థలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోని మైక్రో మార్కెట్లలో13 షోరూమ్‌లను కలిగిన తమ సంస్థ జ్యువెలరీ మార్కెట్లో 4 శాతం వాటాను కలిగి ఉందని ప్రతినిధులు తెలిపారు. ప్రారంభ పబ్లిక్ ఆఫర్ కోసం ప్రైస్ బ్యాండ్ ఈక్విటీ షేరుకు 204 నుంచి 3215 వరకు నిర్ణయించామన్నారు. కంపెనీ ప్రారంభ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ కోసం ఈ నెల 22న ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇది అదే నెల 26తో ముగుస్తుందని వెల్లడించారు. పెట్టుబడిదారులు కనీసం 69 ఈక్విటీ షేర్లు, ఆ తర్వాత 69 ఈక్విటీ షేర్ల గుణిజాలలో వేలం వేయవచ్చునన్నారు.

ఫ్లోర్ ధర ఈక్విటీ షేర్ ముఖ విలువ కంటే 20.4 రెట్లు, క్యాప్ ధర ఈక్విటీ షేర్ ముఖ విలువ కంటే 21.5 రెట్లు ఉంటుందని, ఈక్విటీ షేరు 710 ముఖ విలువ కలిగిన పబ్లిక్ ఇష్యూలో రూ. 210 కోట్ల వరకు విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేసినట్టు తెలిపారు. 2.8 మిలియన్ల ఒఎఫ్‌ఎస్‌గా ఉంటుందని తెలిపారు. వైభవ్ జ్యూయలర్స్ రిటైల్ షోరూమ్‌లు ఎక్కువగా టైర్ 2, టైర్ 3 నగరాల్లో ఉన్నాయని, విభిన్నమైన డిజైన్లలో బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు, రత్నాలు, ప్లాటినం, వెండి ఆభరణాలను విస్తృత శ్రేణిలో కలిగి ఉన్నట్టు తెలిపారు. సంస్థ గడిచిన 3 నెలల్లో రూ. 508.90 కోట్లు వ్యాపారం చేసి నికర లాభం రూ.19.24 కోట్లు సాధించినట్టు వెల్లడించారు.

వేతన బకాయి చెల్లించాలని ఆందోళన



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : వేతన బకాయిలు చెల్లించాలని విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్ వద్ద కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వివి.రమణ మాట్లాడుతూ మెయింటనెన్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 8 నెలలుగా వివిఎస్ ఎంటర్‌ప్రైజెస్ జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. విషయాన్ని స్టీల్ యాజమాన్య దృష్టికి తీసుకెళ్లడంతో రెండు నెలలకోసారి జీతాలు చెల్లిస్తున్నా, కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అంతేకాక మెయింటనెన్స్, పబ్లిక్‌హెల్త్ విభాగాల మధ్య కాంట్రాక్టు కార్మికులు వేధింపులకు గురౌతున్నార న్నారు. ఇప్పటికైనా స్టీల్ యాజమాన్యం స్పందించి, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెలా వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. యూనియన్ నేతలు బొట్ట గంగరాజు, అమిరెడ్డి పెంటారావు, బి.శ్రీనివాసు, దాసరి చిన్నమ్ములు, నాగేశ్వరరావు, కనకమాలక్ష్మి, వి.దేవిక, వెంకటలక్ష్మి, జి.అప్పారావు, సోమేష్, రవణమ్మ, అప్పల నరసమ్మ, రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికుల ధర్నా



అనకాపల్లిలో ఆందోళన చేపట్టిన కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులతో గతంలో జరిగిన ఒప్పందాన్ని ఆగస్టు 31లోగా అమలు చేస్తానని చెప్పారని, కాని ఇంతవరకు అమలు కాలేదని తెలిపారు. అందువలన తప్పని పరిస్థితుల్లో నీటి సరఫరా, యుజిడి, వెటర్నరీ, మలేరియా, పారిశుధ్యం, ఎంఎస్ఎఫ్, క్లాప్ డ్రైవర్లు తోపాటు అన్ని సెక్షన్ కాంట్రాక్ట్ /అవుట్‌సోర్సింగ్ కార్మికులు 7,000 మంది సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. వారసత్వ పోస్టులు కార్మికుల బిడ్డలకే ఇవ్వాలని, జిఒ 7 ప్రకారం క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 చెల్లించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు టర్నకాక్, ఎలక్ట్రికల్ హెల్పర్స్, ఫిట్టర్ హెల్పర్లు, గార్డెనర్లు, సిల్ట్ క్లీనర్లుకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, డ్రైవర్లు, వెటర్నరీ, మలేరియా, యుజిడి కార్మికులకు హెల్త్ అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, నాయకులు ఎ.బాలకృష్ణ, యూనియన్ జోనల్ గౌరవాధ్యక్షులు గంటా శ్రీరామ్, బొమ్మల రాము, నిమ్మకాయల అజయ్, శింగంపల్లి వాసు, నూకరాజు, చంద్రశేఖర్, శివ పాల్గొన్నారు.

పిఎం పాలెం : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్ర వారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు కార్మికసంఘం నేత ప్రసాద్ వెల్లడించారు. సమ్మెలో భాగంగా శనివారం రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం నుండి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి. అనంతరం ధర్నా చేస్తామన్నారు. యూనియన్ నాయకులు సిహెచ్ శేషుబాబు, ఎస్ రామప్పుడు, జి విజయ, కె.నాగరాజు, బి రాంబాబు, రత్నం, ఎం ఆదిలక్ష్మి, జి కిరణ్, బి నరసింగరావు, క్లాప్ డ్రైవర్లు కె సన్ని, ఎస్ చిన్న పాల్గొన్నారు.



మధురవాడలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో వర్క్‌షాప్



మాట్లాడుతున్న ముఖ్య అతిథి

ప్రజాశక్తి -తగరపువలస: స్థానిక ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో శుక్రవారం డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ, మెడ్నెట్ డిజిటల్ లైబ్రరీ కాన్సర్షియం ఆధ్వర్యంలో ఒక్రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. జర్నల్స్ అండ్ ఈ-బుక్స్ క్లినికల్ ట్రైల్స్ అండ్ డిజిటల్ ఇమేజెస్‌ను ఎలా వినియోగించుకోవచ్చో వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్, చీఫ్ లైబ్రేరియన్ డాక్టర్ ఎస్ సురేష్, ట్రైనింగ్ మేనేజర్ రాజ్‌కుమార్ మహాపాత్ర, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

నేడు ఉపాధి సామాజిక తనిఖీల ప్రజావేదిక

ప్రజాశక్తి - పద్మనాభం: మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయం వద్ద శనివారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ బృందం గత నెల 27 నుంచి ఈనెల 15వరకు నిర్వహించిన సామాజిక తనిఖీల నివేదికలను ప్రజావేదికలో వెల్లడిస్తారన్నారు. అన్ని గ్రామ పంచాయతీల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సోషల్‌ఆడిట్ ఓపెన్‌ఫోరంలో పాల్గొనాలని ఎంపిడిఒ కోరారు.

తైక్వాండో విజేతలకు అభినందన

ప్రజాశక్తి -మధురవాడ : జార్ఖండ్ రాజధాని రాంచీలో ఈనెల 2నుంచి నిర్వహించిన 14వ ఓపెన్ తైక్వాండో జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మన రాష్ట్రం తరుపున మధురవాడకు చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తా చాటారు.తైక్వాండో.క్యాడెట్ 53కిలోల విభాగంలో మణికంఠ హిమాన్స్ ద్వితీయ స్థానాన్ని, ఉమ్స్ క్యాడెట్ విభాగంలో సాయి ప్రతాప్ తృతీయస్థానం సాధించారని విశాఖపట్నం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం అచ్చినాయుడు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులతోపాటు కోచ్ సుకుమార్ సంపత్‌లను శ్రీ కనకదుర్గా సప్లయర్స్ అండ్ క్యాటరింగ్ అధినేత కొర్రాయి సురేష్, యూత్ తైక్వాండో కార్యదర్శి ఎం.సురేష్ అభినందించారు కార్యక్రమంలో క్రీడాకారుల తల్లిదండ్రులు పిల్ల సురేష్, పోతిన శివ, అనిల్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- ఉక్కునగరం : ఉక్కునగరం సికె.నాయుడు స్టేడియంలో అగనంపూడి ఛాంపియన్స్ లీగ్ సీజన్ -2 క్రికెట్ పోటీలను జనసేన ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్, గాజువాక ఇన్‌ఛార్జి కోన తాతారావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నేతలు గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, విందుల వెంకటరమణ, వెంకటరావు, దుల్లా రామునాయుడు, బలిరెడ్డి నాగేశ్వరరావు, ఆర్మీ గోవింద్, గుంటూరు మూర్తి, అట్టా అప్పారావు, మెడిశెట్టి విజయ్, విందుల చిరురాజు పాల్గొన్నారు.

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి


ఎపి రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ, హరిబాబు


మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. ఏపీ రైతు కౌలు, రైతు సంఘాల సంయుక్త సమావేశం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన కార్మిక కర్షక నిలయంలో శుక్రవారం జరిగింది. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కల ప్రకారమే నేటికీ 60 వేల ఎకరాలపైగా వరి నాట్లు పడలేదని, వేసిన వరి ఆకులు వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయాయని తెలిపారు. జిల్లాలోని 9 మండలాల్లో సగటు వర్షపాతం కంటే తక్కువ నమోదైందని, మరోవైపు విద్యుత్ కోతల వలన సాగునీరు అందే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పలు మండలాల్లో పర్యటనలు చేసి, జిల్లా కలెక్టర్, ఎంపీ, వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి కరువు పరిస్థితులను తీసుకెళ్లామని, అయినా వారెవ్వరూ స్పందించకపోవడం విచారకరమన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించాలని, డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఈ తొమ్మిదేళ్ల కాలంలో రూ.14 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని, రైతులకు రుణమాఫీ చేయడం లేదని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులకు కరువు పనులు చేపట్టాలని, ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు ఎరువులు ఉచితంగా ఇవ్వాలని, వడ్డీ లేని రుణాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో రెండు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలరాజు, ఎ.బాలకృష్ణ, నాయకులు జి.నాయనబాబు, సాపిరెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ విశాఖపట్నం, అనకాపల్లి ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావుకు పాయకరావుపేట మండలం పెంటకోటలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు వినతిప్రతం అందజేశారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా నాయకులు బి.నాగేశ్వరరావు, ఆర్.దండుబాబు తదితరులు పాల్గొన్నారు


వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు నాయుడు, కళాసీలు

ముఠా కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-చోడవరం : ముఠా కళాసీకు పని భద్రత, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని, వెల్ఫేర్ బోర్డు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలో వెంకన్నపాలెంలో సంతకాల సేకరణ చేసి, అనంతరం సచివాలయం కార్యదర్శి వినత పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్వి నాయుడు మాట్లాడుతూ కిరాణా షాపులు, సిమెంట్ ఐరన్, టైల్స్, పంచదార గోదాముల్లో పనిచేస్తున్న ముఠా కార్మికులకు నిర్దిష్టమైన పని గంటలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో చనిపోయిన కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నారన్నారు. అధిక బరువు వేయడం వలన రోజుకు 12 నుండి 16 గంటల పని చేయడం వల్ల చిన్న వయసులోనే వృద్ధాప్యంలోకి నట్టిబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, సాధారణ మృతులకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోలమాంబ ముఠా కార్మిక సంఘం నాయకులు జోగారావు, నమ్మి రమణ, పల్లా సత్తిబాబు, గండి శ్రీను రాజు, వీపు గోవిందా, మువ్వల అప్పలనాయుడు, పళ్ళ తాతబాబు, నంబరు మంగ, నంబర్ కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

నాతవరం పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ గత నెల 25న రోడ్డు ప్రమాదంలో మరణించిన కె.అప్పారావు కుటుంబానికి రూ.60వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో భీమిలి, పాయకరావుపేట, స్పెషల్ బ్రాంచ్, జిఆర్‌పి, నాతవరం పోలీసు స్టేషన్లలోఅప్పారావు పని చేసి అధికారుల మన్ననలు పొందారు. 1990 సంవత్సరం బ్యాచ్ మేట్స్ అనిల్, సుబ్బరాజు, నాయుడు, రమేష్, సింహాచలం, బాబురావు, రఘు, బీశెట్టి వెంకటేశ్వరరావు, మిలిటరీ నాయుడు ద్వారా సేకరించిన రూ.60వేలు నగదును మధురవాడలోని అప్పారావు స్వగృహానికి హెడ్ కానిస్టేబుల్స్ వెంకటేశ్వరరావు, పూర్ణచంద్ర శుక్రవారం వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆర్థిక సాయం అందజేశారు.

17న పూడిమడక తీరం పరిశుభ్రత

ప్రజాశక్తి- అచ్యుతాపురం : స్వచ్ఛ సాగర్ -సురక్షిత సాగర్ అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం పూడిమడక సముద్రతీరంలో తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ప్రారంభమయ్యే పరిశుభ్రత దినోత్సవ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

వినాయక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక స్వయంభు విగ్నేశ్వర ఆలయంలో వినాయక ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాన్ని ఇటీవల కాలంలో ఎంతో అభివీద్ధి చేశామన్నారు. నాలుగు పక్కల గాలిగోపురాలు నిర్మిస్తుమన్నామని చెప్పారు. రాష్ట్రంలో రెండవ కాణిపాకంగా పేరొందిన చోళవరం స్వయంభు విఘ్నేశ్వర ఆలయం ఎంతో ప్రతిష్టాత్మకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి జయదేవ్, ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పల సతీష్, స్థానిక ఎంపీపీ గాడి కాసు, దేవాదాయ శాఖ ఈవో సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువక సత్యారావు, ప్రధానార్చకులు కొలమంచిలి చలపతి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తదితరులు



అవార్డు అందుకుంటున్న సాగర్ సిమెంట్ అధికారులు

సాగర్ సిమెంట్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని బయ్యావరం వద్ద ఉన్న సాగర్ సిమెంట్ కంపెనీకి 24వ జాతీయ అవార్డు లభించింది. ఈ నెల 13 నుండి 15వ తేదీ వరకు యూనిట్ల గ్రైండింగ్ విభాగంలో జరిగిన ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్-2023 పోటీలలో సాగర్ సిమెంట్స్ లిమిటెడ్, బయ్యావరం యూనిట్ ప్రతిష్టాత్మకమైన (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్‌ను 24వ జాతీయ అవార్డును పొందింది. ఈ అవార్డును సిఐఐ సభ్యులు చేతుల మీదుగా 14న హైదరాబాద్‌లో కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, కంపెనీ ఎలక్ట్రికల్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ మేనేజర్ యన్ సతీష్, ప్రాసెస్ ఇంచార్జ్జి పి ఎస్‌విఎస్ నారాయణ అందుకున్నారు. ఈ అవార్డును వరుసగా 4వ సంవత్సరం సాగర్ సిమెంట్స్ కైవసం చేసుకుంది.

రైవాడ రిజర్వాయర్‌ను పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-దేవరాపల్లి : జలాశయాల పునరుద్ధరణ పథకం కింద మండలంలోని రైవాడ రిజర్వాయర్‌ను అభివృద్ధి చేపట్టేందుకు రూ.252 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వం పంపింది. ఈ మేరకు ఢిల్లీకి చెందిన సాంకేతిక నిపుణులు గౌరవ భగవత్‌తో పాటు ఐదుగురితో కూడిన బృందం శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చింది. బోటులో 15 రోజులు పాటు జలాశయంలో సర్వే చేసి సాంకేతిక పరమైన అవసరాలను గుర్తించే విధంగా సర్వే చేస్తుందని డిఈఈ సత్యం నాయుడు తెలిపారు. స్పిల్ వే గేట్లు ఎత్తు చేయాలన్న పలు అంశాలతో రూ.252 కోట్లతో ప్రతిపాదనలు ఇంజనీరింగ్ చీఫ్ తదితర బృందం తయారు చేసిన నివేదికను గతంలో పంపించినట్లు చెప్పారు. జలాశయం గర్భ విస్తీర్ణం తగ్గిందా నీటి సామర్థ్యం తగ్గిందా అనే కీలకమైన అంశాలు సర్వేలో వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈలు కిశోర్, రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

టిడ్కో గృహాలు రానివారికి

డబ్బులు వాపసు చేయకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం


అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

ప్రజాశక్తి - యలమంచిలి

ఇళ్ల కోసం అడ్వాన్స్ సొమ్ము చెల్లించిన టిడ్కో లబ్ధిదారులకు అనేక కారణాల చేత ఇళ్లు ఇవ్వలేకపోయామని, వారు కట్టిన అడ్వాన్స్ సొమ్ము తిరిగి వారికి వాపసు ఇవ్వకపోవడంపై స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు మున్సిపల్ అధికారులను ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు ఇవ్వడానికి అడ్డంకులేంటో అర్థం కావడం లేదంటూ అధికారులపై మండిపడ్డారు. శుక్రవారం ఆసరా లబ్ధిదారులకు మూడో విడత సొమ్ము పంపిణీకి వచ్చిన ఆయన టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సొమ్ము గురించి ఆరా తీశారు. చెల్లించలేదని తెలిసి ఉద్వేగంతో ఊగిపోయారు. ఫైల్స్ కనిపించలేదని అధికార్లు చెప్పడంతో అక్కడే ఉన్న చైర్‌పర్సన్ రమాకుమారిని ఉద్దేశించి ఇందులో మీ అలసత్వం కూడా ఉందంటూ తప్పు బట్టారు. చర్యలకు సిద్ధమయ్యాను కాబట్టే విషయం సర్దుబాటు జరిగి ఓ కొలిక్కి తేవడం జరిగిందని రమాకుమారి బదులిచ్చారు. అసలు సంగతి చెప్పమంటూ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వ్యవహరించిన వీరయ్యను అడగ్గా త్వరలోనే అన్నీ సర్దుబాటవుతాయని ఆయన తెలిపారు. ఫైల్స్ కనిపించకపోవడం వెనుక ఎవరెవరున్నారో చెప్పాలంటూ నిలదీయటంతో ఇద్దరు ముగ్గురు ఉద్యోగుల పేర్లొచ్చాయి. ఫైల్స్ నిర్వహణలో బాధ్యత లేకుండా వ్యవహరించిన ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లిపోయిన కమిషనర్‌ను ఉద్దేశించి వెళ్లే వరకు దోచుకోవడంలోనే నిమగ్నమైందని, మున్సిపాలిటీని సర్వనాశనం చేసి వెళ్లిందంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. సోమవారం సొమ్ము వాపసు చేయడం మొదలు పెడతామని మున్సిపల్ అధికార్లు హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే శాంతించారు.



పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

వికలాంగులకు చేయూత

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన మాజీ పాత్రికేయులు కీర్తిశేషులు ధర్మరెడ్డి సన్యాసిరావు 10వ వర్ధంతిని స్థానిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు 75 మంది వికలాంగ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సన్యాసిరావు వృత్తి జీవితంలో చేసిన సేవలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హాస్టల్ వార్డెన్ లక్ష్మీ, సన్యాసిరావు కుటుంబ సభ్యులు చెల్లయ్యమ్మ, ధర్మిరెడ్డి అప్పలనాయుడు, దర్మిరెడ్డి రాజు, లక్ష్మీ, సత్య, రేవతి, కీర్తి సురేష్, రామలక్ష్మణులు, రవి, వంశీ, సంతోష్, చిట్టి, జస్విన్, నేహ్నాస్, గంగరాజు, నాయుడు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో అమావాస్య పూజలు

ప్రజాశక్తి- అనకాపల్లి : నూకాంబిక దేవస్థానంలో అదిబాబు అమావాస్య యూత్ ఆధ్వర్యంలో అమావాస్య పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ఉపాహారం పెట్టి అనంతరం అడిగర్ల శ్రీనివాసరావు, కనకమహాలక్ష్మి దంపతులు, కొంతమంది సహకారంతో సుమారు ఆరువందల మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. సాయంత్రం జరిగిన అమావాస్య పూజ సందర్భంగా షణ్ముఖ స్వీట్స్ అధినేత కంభంపాటి భాను దంపతులు బూరెలు, వడలు, పులిహోర, పరమాన్నం, పెరుగు గారెలు, అరిసెలు వంటి నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి కొల్లూరు సూర్యకిరణ్, శివాని దంపతులు రూ.13,800 అందజేశారు. ఈ సందర్భంగా దాతలను దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, దాడి జయవీర్, ఈఓ బండారు ప్రసాద్ సత్కరించారు.

కొనసాగిన టిడిపి నిరాహార దీక్షలు

మహిళలకు 'ఆసరా'

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ద్వారా అమలవుతోన్న డ్వాక్రా గ్రూపుల స్వయం పోషకత్వానికి బాటలు వేసే 'ఆసరా' పథకం ఎంతో మంది మహిళలకు అండగా నిలిచిందని ఎమ్మెల్యే రమణమూర్తి రాజు కొనియాడారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన రుణ వితరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలిచ్చారు. ఆసరా మూడో దఫా రుణ పంపిణీలో ఇక్కడ 20 గ్రూపులకు రూ.93.27 లక్షలు అందకపోవడంతో వాటి గురించి వాకబు చేసి అందులో 17 గ్రూపులకు రూ.69 లక్షల, 96 వేలు వెంటనే విడుదలకు కృషి చేసి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇంకా 3 గ్రూపులకు చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, కమిషనర్ కె.వి.కొండలరావు, ఎంఇ వీరయ్య, డిసిసిబి మాజీ చైర్మన్ తేజవర్మ, బొద్దపు ఎర్రయ్యదొర, మళ్ల కొండబాబు, మెప్మా సమన్వయకర్త పద్మావతి, దాసరి కుమార్, షేక్ సయ్యద్ బీబీ, దూది నరసింహమూర్తి, పండూరి మరినాథ్, తుమ్మపాల శ్రీనివాసరావు, మేనేజరు ప్రభాకరరావు, టిపిఒ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రీ సర్వే నోటీసులు పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ గ్రామ సచివాలయంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం సమగ్ర రీ సర్వేను పూర్తి చేసి, రైతులకు నోటీసులను వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ పత్రాల్లో ఎవరికైనా తప్పులు ఉంటే 15 రోజుల్లోగా సంబంధిత అధికారులకు తెలియచేస్తే వారు రీ సర్వే చేసి పాస్ బుక్‌లు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, సర్వేయర్ మణికంఠ, రైతులు పాల్గొన్నారు.

ఫార్మా, రాంకీ యాజమాన్యాలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని తానాం గ్రామంలోకి కొండగెడ్డ ద్వారా విష రసాయనాలు విడిచిపెట్టిన ఫార్మా యాజమాన్యాలపైనా, డెవలపర్ బాధ్యతలను సక్రమంగా నిర్వహించని రాంకీ యాజమాన్యంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ శుక్రవారం పరవాడ డిప్యూటీ తహశీల్దారు శాంతి భూషణంకు వినతిపత్రం అందజేశారు. ఫార్మా కాలుష్యాన్ని అరికట్టాలని, తానాం గ్రామ ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని కోరారు. దీనికి స్పందించిన డిప్యూటీ తహశీల్దారు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే వ్యర్థ జలాలను ట్యాంకర్ల ద్వారా రాంకీ యాజమాన్యం కొంత తరలించిందని, మిగిలింది కూడా తరలించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాలకు రసాయనిక వ్యర్థ జలాలు రాకుండా భూగర్భ జలాలు నాశనం కాకుండా ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని గనిశెట్టి కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ

ప్రజాశక్తి - పరవాడ : ఈ నెల 30వ తేదీన ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు, ఐసిడిఎస్ సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ అధ్యక్షతన శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హేమ సుందరరావు మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. ఖరీదైన వైద్య చికిత్స కావాల్సిన వారికి ఈ నెల 30 నుండి జరిగే వైద్య శిబిరంలో పరీక్షలు, స్పెషలిస్ట్ వైద్యులచే వైద్య చికిత్సలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ, వాడ చీపురుపల్లి వైద్యాధికారులు డాక్టర్ రంజిత్, డాక్టర్ క్రాంతి కుమార్, ఆరోగ్య సిబ్బంది, సచివాలయం కార్యదర్శులు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - యలమంచిలి

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే పప్పల చలపతిరావు ఆధ్వర్యంలో యలమంచిలి పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజు శుక్రవారం కొనసాగాయి. టిడిపి రాంబిల్లి మండలం అధ్యక్షుడు వసంతవాడ దిన్‌బాబు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు ఈ దీక్షల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధూళి రంగనాయకులు, కసిరెడ్డి ప్రసాద్, చోడపల్లి సత్యనారాయణ, కర్రి ప్రసాద్, బద్ది రమణ, దేముడు , అప్పలరాజు, రవిరాజు, చిట్టిబాబు, దలమ్మదేవి, నారాయణరావు పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

మునగపాక రూరల్ : స్థానిక టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజుకు చేరుకున్నాయి. జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశు రాం ఆ పార్టీ కార్యకర్తలు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాడి ముసలినాయుడు, పెంటకోట విజయ్, ఎంవి నరసింహారావు, ఎపిఎం సత్యనారాయణ, సబ్బి శ్రీనివాసరావు, దొడ్డి రమేష్, ఆడారి లక్ష్మణరావు, బి ప్రసాద్, ఆడారి కన్నబాబు, ఇల్లూరి నూక నరసింహారావు, ఆడారి అబ్బాయి నాయుడు, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండల కేంద్రంలో టిడిపి, జనసేన నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, దొంకిన అప్పలనాయుడు, కోరుకొండ రవికుమార్, సాయం శేషు, జనసేన మండల అధ్యక్షులు డిఎస్ నాయుడు, తుంపాల రమేష్, పలువురు సర్పంచులు ఎంపిటీసీలు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని తునివలస బంగారమ్మ ఆలయం వద్ద టిడిపి ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు పగలగొట్టి నిరసన తెలిపారు. మండలపార్టీ అధ్యక్షులు కె.రమణ, తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.లీలావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్యన్ మూర్తి, ఎం నందీశ్వరరావు, కె.దామోదర పాల్గొన్నారు.

ఆరిలోవ : టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో తోటగరువు టిడిపి కార్యాలయం వద్ద నిరసనదీక్షల్లో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. టిడిపి, సిపిఐ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎద్దఎత్తున నలుపురంగు దుస్తులు ధరించి, ప్లకార్డులు పట్టుకుని, వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నినాదాలు చేశారు. సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో విమల, ఎస్.కె.రెహ్మాన్, బుడుమూరు గోవిందు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, గాడు అప్పలనాయుడు, ముగడ రాజారావు, మూడి అప్పారావు, క్రిష్ణంరాజు, ఏడువాక సన్యాసిరావు, మజ్జి రమణి, బాలస్వామి, నమ్మి గణేష్, పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక టిడిపి కార్యాలయం నుంచి పెందుర్తి కూడలి వరకు టిడిపి జనసేన నాయకులు ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో 96 వ వార్డు కార్పొరేటర్ పిలా శ్రీనివాసరావు, వేగి పరమేశ్వరరావు, కరణదేవుడు, ఆవగడ్డ అప్పలనాయుడు, మడక పార్వతి టిడిపి పాల్గొన్నారు.

సింహాచలం : టిడిపి జిల్లా కార్యదర్శి కార్యదర్శి పాసర్ల ప్రసాద్, 98వ వార్డు అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. నిరసన ప్రదర్శన చేపట్టారు.

ఉక్కునగరం : 87 వార్డు టిడిపి కార్యాలయం వద్ద కార్పొరేటర్ బొండా జగన్నాథం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజన్న రాజు, విజయరామరాజు, కర్రీ కన్నారావు, కల్లేపల్లి శ్రీనివాస వర్మ, వర్రే రాంబాబు, గెద్దాడ రాంబాబు, డీవీ సూరిబాబు, కణితి ఈశ్వరరావు, ఎస్. అప్పారావు, శాంతారావు.కల్లేపల్లి అశోక్ వర్మ, పివిఎన్. మూర్తి, జాన్ రమేష్, సూరిబాబు, పోతల కృష్ణ, భాగ్య లక్ష్మి, పెంటయ్య, కడుపుట్ల శ్రీను, అప్పలరాజు, బి. సన్యాసి సన్యాసిరావు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేటలో నిరాహార దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

గాజువాక: అక్రమ కేసులో చంద్రబాబును జైల్లో పెట్టించిన వైసిపికి ఇవే చివరి ఎన్నికలని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పాత గాజువాక జంక్షన్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన టిడిపి నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పుచ్చ విజయకుమార్, కార్పొరేటర్లు బొండా జగన్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు. మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, కరణం సత్యారావు, ఆడారి రామకృష్ణ, గంతుగోరు అప్పారావు పెద్దాడ సోమినాయుడు, డివి జగదీష్, భెల్ గుర్తింపు ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, స్వర్ణపుడి రాంబాయి, భవాని. పోలవరపు జ్యోతి, స్వరూప రాణి. కోరుకొండ మంగ, లక్ష్మి, సరోజినీ. పాల్గొన్నారు.

ప్రధానికి పోస్టు కార్డులు

అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులపై మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రధాని మోడీకి శుక్రవారం పోస్టు కార్డులు పంపారు. తుమ్మపాలలో శుక్రవారం టిడిపి శ్రేణులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. ఈ దీక్షకు జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. జగన్‌రెడ్డి రహిత ఆంధ్రప్రదేశ్‌కై టీడీపీ, జనసేన పోరాటం చేస్తున్నాయని పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రీ బాబీ, కొణతాల శ్రీనివాసరావు, చెక్కలన్న, జనసేన నాయకులు దూలం గోపి, శ్రీను, పల్లెల గణేష్, జయరాజు పాల్గొన్నారు.

మసీదులో ప్రార్థనలు

యలమంచిలి : చంద్రబాబు నిర్దోషిగా బయటకు రావాలని కోరుతూ శుక్రవారం స్థానిక జామియా మిలియా మసీదులో ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, రంగ నాయకులు, నానాజీ, దొడ్డి శ్రీనివాసరావు, కొలుకులూరి విజయబాబు, రమణబాబు, కూనిశెట్టి రమణ, ముస్లిం పెద్దలు కన్నా సాహెబ్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని, బయ్యవరం అన్సర్ ఔలియ దర్గాలో చంద్రబాబు కోసం ముస్లిం మత పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ శుక్రవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు ఉగ్గిని రమణమూర్తి, షేక్ బాబర్, సిద్ది రెడ్డి సూర్యనారాయణ, బాబూ రావు, గొల్లవిల్లి ప్రవీణ్, సీరంశెట్టి వెంకట లక్ష్మీ, ముస్లిం మత పెద్దలు రెహమాన్ షరీఫ్, అయ్యం షరీఫ్, జిలానీ, నాగరాజు, గడసాల శ్రీను పాల్గొన్నారు.

గోపాలపట్నం : చంద్రబాబు విడుదల కోరుతూ గోపాలపట్నం మసీదులో ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో ముస్లిములు ప్రార్థనలు జరిపారు. జనసేన నేతలు సంఘీభావం తెలిపి పాల్గొన్నారు.

సిపిఐ సంఘీభావం

భీమునిపట్నం: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలకు సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి ఎం పైడిరాజు సంఘీభావం తెలిపారు. టిడిపి సంతకాల సేకరణలో కూడా పాల్గొన్నారు. 'బాబుతో నేను' వాల్ పోస్టర్లను ప్రదర్శించారు. టిడిపి నేత ఎస్ అప్పారావు పాల్గొన్నారు

250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం అండలపల్లి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కొండకర్ల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో విశాఖ ఐ హాస్పిటల్ నేత్ర వైద్యులు 280 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. కంటి సమస్యలను గుర్తించిన వారికి ఉచితంగా కళ్లజోళ్ళు పంపిణీ, కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని నిర్వాహకులు ఆది నాగేశ్వరరావు, సూరిశెట్టి చంద్రశేఖర్ తెలిపారు.

చెరుకు తోటల పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వేచలం గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎల్వై. కాంతమ్మతో కలిసి కొన్నెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజ్ కుమార్ చెరుకు తోటలను శుక్రవారం పరిశీలించారు. వేచలపు సింహాద్రిపుడు పొలంలో చెరుకులో ఆకులు పసుపు రంగులో మాడి ఎండిపోవటం గమనించారు. ఎకరానికి 50 కేజీల పొటాష్ వేయాలని, సూక్ష్మ పోషకాలు రూపంలో మల్లి - కే ఎకరానికి 1 కేజీ పిచికారీ చేయాలని సూచించారు. చెరుకు వేసిన రైతులు అందరూ 6 నెలలు దాటిన తోటలలో తీగ జాతి గడ్డిని - ఆల్ మిక్సచర్ అనే గడ్డి మందును - (8 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో) కలిపి పిచికారీ చేయటం ద్వారా పసుపు ఆకు తెగుళ్ల నివారించేందుకు అవకాశం ఉంటుంది తెలిపారు.

శాశ్వత భూ హక్కు పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద భూమి పాస్ పుస్తకాలను మండలం ఊడేరు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం, మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఊడేరు సర్పంచ్ సిరిగిరి శెట్టి కృష్ణమోహన్, పెద్దాడ రామ్ శంకర్, వైసిపి నాయకులు సకల సంతోష్, వెంకుపాలెం ఎంపీటీసీ రాపెట్టి వెంకటేష్, పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్, మండల ఏఈ కుమార్ రాజా, మహిళా పోలీస్, ఏఎన్ఎం పాల్గొన్నారు.



పాస్ పుస్తకం అందజేస్తున్న ఎంపిపి సూరిబాబు

నూతన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం రాత్రి సర్పంచ్ భీశెట్టి గంగపులనాయుడు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బొడ్డెడ ఆదికుమార్, వార్డు మెంబర్లు ఆడారి సత్యనారాయణ, ముల్లేటి గోవిందరావు, కాంగ్రెస్‌గుల శ్రీనివాసరావు, ఆడారి సన్యాసినాయుడు, గృహ సారథులు కె.నాగేశ్వరరావు, కె ఈశ్వరరావు, ఆడారి జ్యోతి, మొల్లేటి సోమేశ్వరరావు, కె సన్యాసినాయుడు, ఆడారి హైమ, ఎస్ బుజ్జి, వాలంటీర్లు కనిశెట్టి వరలక్ష్మి, సరగడం వరలక్ష్మి గ్రామ పెద్దలు బొడ్డెడ పైడికొండ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: మండలంలోని చెట్టు పల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన పెన్షన్లు దారులకు వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం రమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఎస్.రాయవరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే జగనన్న లక్ష్యమని కొరుప్రోలు సహయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు చేకూరి శ్రీరామచంద్రరాజు అన్నారు. కొరుప్రోలు గ్రామ సచివాలయంలో నూతన పింఛన్లను అందచేశారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ రామలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: అర్హులందరికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అన్నారు. చీడిగుమ్మల గ్రామంలో పింఛన్లపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కొత్తకోటలో ఆడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- యంత్రాంగం:విద్యార్థులు క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అనకాపల్లి జిల్లాలోని పలు పాఠశాలల్లో పోటీలు నిర్వహించారు.

నక్కపల్లి:విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా ,క్రీడాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి ఆటల పోటీల్లో రాణించాలన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికై పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కబడ్డీ ,కోకో, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీల్లో పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పిడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్న కుమారి ,జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, ఎంఈఓ నరేష్, హెచ్ఎం రాణి లలిత, స్కూల్ చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు టీవీ రమణ, పిడి షేక్ బీబీ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నక్కపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్చార్జి ఎలమంచిలి తాతబాబు, వైసిపి నాయకులు సూరకాసుల గోవింద్, శేషారత్నం, గొర్ల బాబురావు పాల్గొన్నారు.

చీడికాడ:విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను పెంపొందించడానికి క్రీడలు ఉపయోగపడతాయని ఎంఈఓ బొంజు బాబు తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలకు క్రీడలు నిర్వహించినట్లు పిడి మల్లేశ్వరి, ఎంఈఓ కే బొంజు బాబు తెలిపారు.

కొత్తకోట:రావికమతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల స్కూల్ గేమ్స్ పోటీలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. అండర్-14, అండర్-17 విభాగాలలో పలు పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థినులు ఈ పోటీలలో పాల్గొన్నారు. రావికమతం పాఠశాల కమిటి చైర్మన్ కొసిరెడ్డి ప్రసాద్, హెచ్ఎం మల్లిఖార్జునరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పైల లక్ష్మణరావు ఈ పోటీలను ప్రారంబించారు. కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ రావికమతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. త్రోబాల్, బాల్ బ్యా డ్మింటన్ పోటీలు టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహిస్తామని లక్ష్మణరావు తెలిపారు. చోడవరం నియోజకవర్గం స్థాయిలో నిర్వహించే వివిధ రకాల పోటీలకు సుమారు 100 మంది విద్యార్థినిలు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

అచ్యుతాపురం:స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మండల స్థాయి విద్యార్థుల క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. అచ్యుతాపురం కైట్స్ విద్యా విహార్ పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలు శుక్రవారం రెండవ రోజు కొనసాగాయి. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర పోటీలు జరిగాయి. కైట్స్ విద్యా విహార్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్, జూనియర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పోటీలు జరుగుతున్నాయి.

యలమంచిలి : యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతునన స్కూల్ గేమ్స్ పోటీల్లో బాలికలు మంచి ప్రతభ కనబర్చినట్లు పిడి మూర్తి చెప్పారు. ఏడు క్రీడాంశాల్లో ఈ పోటీలు జరిగాయని, నియోజకవర్గ స్థాయిలో తలపడే మండల స్థాయి జట్లకు బాలికలు ఎక్కువ సంఖ్యలో ఎంపికైనట్లు పేర్కొన్నారు. జట్ల ఎంపిక కార్యక్రమంలో పిడిలు షబ్బీర్, సురేష్, శారద, సూర్యప్రభ, రాజు, వంశీ, మూర్తి, ఫెడరేషన్ సమన్వయకర్త వెంకటరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలురు, బాలికలను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుంది. మండలంలోని ఆరు ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు ఈ పోటీలకు హాజరైనట్లు హెచ్ఎం పద్మావతి తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగ, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు సత్యానారాయణ, ప్రసాద్, లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు, సూదివలస ఎంపిటిసి వర్రి రామునాయుడు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్ 14, 17 మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, జెడ్పిటిసి కర్రి సత్యం శుక్రవారం ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, బ్యాడ్మింటన్ తదితర పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. 11 పాఠశాలల నుండి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ పడాల దాసు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో నైపుణ్యం పెంపొందించుకోవాలని స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్ నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంఇఒలు లక్ష్మణరావు, బిఎస్ఎన్ మూర్తి, సర్పంచ్ డి.ప్రసాదరావు, ఉపసర్పంచ్ ఎం. లక్ష్మణరావు పాల్గొన్నారు.



ఎంపిని సన్మానిస్తున్న సర్పంచులు

ఎంపీ సత్యవతికి ఘన సన్మానం

- రూ.45 లక్షల మంజూరుపై సర్పంచుల హర్షం

ప్రజాశక్తి- వడ్డాది :ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సహకారంతో అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతి మంగళాపురం ఆయకట్టు నిర్మాణంకు సుమారుగా 45 లక్షలు మంజూరు చేశారని సర్పంచులు తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతికి సర్పంచులు విజయకుమార్, కంటే పద్మరేఖ, గణపతి, నాగబాబు, వైసిపి నాయకులు కంటే వెంకట అప్పారావు, కృష్ణ, జగ్గు, కూర్మలు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎంపిని సన్మానించారు.



పాస్ పుస్తకాలు ఇస్తున్న సర్పంచ్

పట్టా పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -రావికమతం: జగనన్న భుహక్కు - భూ రక్ష పథకంలో భాగంగా కవగుంట గ్రామపంచాయతీ శివారు బుడ్డిబంద గ్రామంలో జరిగిన రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం రైతులందరికీ సర్పంచ్ దాసరి సూర్య కుమారి, ఉపసర్పంచ్ భవాని చేతుల మీదుగా పట్టా పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రీ సర్వేతో హక్కు పత్రాలను అందజేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. సుమారు 80 మంది రైతులకు పట్టాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పక్కాగా సర్వే నిర్వహించి హద్దుల ప్రకారం రాళ్లను వేశారన్నారు. ఈ కార్యక్రమంలో వీరభద్రరాజు, రాము, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఈ - పంట నమోదును పరిశీలిస్తున్న మోహనరావు

ఈ - పంట నమోదు

ప్రజాశక్తి -కోటఉరట్ల: ఈ పంట నమోదు పట్ల నిర్లక్ష్యం చేయరాదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు తెలిపారు. వివిధ పంటలపై సిబ్బంది ఈ పంట నమోదు పకడ్బందీగా నిర్వహించాలన్నారు శుక్రవారం మండల కేంద్ర రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రాఫ్‌తో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రైతులకు అందుతాయని తెలిపారు, మండలంలో ఈ క్రాప్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సరోజిని. రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు:డుంబ్రిగుడ మండలానికి చెందిన 110 స్వయం సహాయ సంఘాలకు రూ.2కోట్ల 50 లక్షల 71 వేల బ్యాంకు లింకేజీ చెక్కును ఐటిడిఏ పి ఓ వి. అభిషేక్ చేతుల మీదగా లబ్దిదారులకు శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో పంపిణీ చేసారు. బ్యాంకు లింకేజీని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని పిఓ సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిడి వి.మురళి, ఎస్ డిసి వి.వి.ఎస్. శర్మ, ఎల్ డిఎం రవితేజ, వెలుగు సిబ్బంది, స్వయం సహాయ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-కోటవురట్ల: వైసీపీ మండల పార్టీ అధ్యక్షునిగా పైల రమేష్‌ను నియమించారు. ఈ మేరకు నియామక పత్రం అందినట్లు ఆయన తెలిపారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ఆయన గతంలో వైసీపీ మండల అధ్యక్షునిగా పని చేశారు. ప్రస్తుతం జిల్లా బీసీ సెల్ అధ్యక్షులుగా ఉన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

కొత్తకోట:రావికమతం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కొత్తకోట కు చెందిన గుమ్ముడు సత్యదేవ్ నియామకం అయ్యారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు అమరావతి లో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గత 12 ఏళ్ళు గా కొత్తకోట కో ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులుగాను ఏడు ఏళ్ళ పాటు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డిసిసిబి డైరెక్టర్ గాను మరో ఐదు ఏళ్ళు గా ఉమ్మడి విశాఖ పట్నం జిల్లా డిసిఎంఎస్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంత వరకూ



పైలా రమేష్



సత్యదేవ్

మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ముక్కా మహాలక్ష్మి నాయుడు అనారోగ్యం కారణంగా స్వచ్ఛందంగా తొలగిపోయారు.ఈ సందర్భంగా సత్య దేవ్ మాట్లాడుతూ,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైసీపీ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.సత్య దేవ్ ను మండల పార్టీ కార్యకర్తలు అభినందించారు.

పారదర్శకంగా రుణాల మంజూరు



ప్యాకెట్స్ చూపుతున్న పీడీ

ప్రజాశక్తి-గొలుగొండ:స్త్రీనిధి రుణాల చెల్లింపులు 100 శాతం జరిగేటట్లుగా వివోఎలందరూ పని చేయాలని అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి అన్నారు. మండల కేంద్రంలో మండల మహిళా సమైక్యలో శుక్రవారం జరిగిన వివోఎల సమీక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. స్త్రీ నిధి రుణాల రికవరీపై సంఘ సభ్యులందరికీ పూర్తి స్థాయి అవగాహన ఉండాలని, సంఘాల రుణాలు మంజూరులో పారదర్శకత ఉండాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ రుణాలపై సంఘ సభ్యులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అలాగే సంఘ సభ్యులు గ్రామాల్లో కిచెన్ గార్డెన్ పెంపకంపై దృష్టి సారించాలన్నారు.పోషక విలువలతో కూడిన ఆహారాన్ని కుటుంబ సభ్యులందరికీ అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మండలం రెండో స్థానంలో ఉందని దీనికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది అందరూ సహకారమే కారణమని కొనియాడారు. త్వరలో జిల్లాలో ఫ్యాషన్ టెక్నాలజీ శిక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మోడల్‌గా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, గొలుగొండ ఎపిఎం పి.మంగ, నర్సీపట్నం క్లస్టర్ లీగల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, స్త్రీ నిధి మేనేజర్ కనకమహాలక్ష్మి, వివోఏలు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న కన్వీనర్

26 నుంచి వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 26, 27, 29 తేదీల్లో విద్యార్థులకు మానవతా విలువలు, నైతిక విలువలపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో విద్యాశాఖ అనుమతితో శ్రీసత్యసాయి సేవా సంస్థలు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసత్యసాయి భజన మండళ్ల మండల కన్వీనర్ కన్నూరు అప్పలనాయుడు తెలిపారు. వ్యాసరచన పోటీలకు సంబంధించి కరపత్రాలను శుక్రవారం ఆయనతో పాటు శ్రీసత్యసాయి సేవా సంస్థల విద్యా విభాగం మండల కన్వీనర్లు చిరికి రామారావు మండంలోని ఏజెన్సీ లక్ష్మీపురం, చోద్యం, మల్లంపేట, గొలుగొండ కస్తూర్బా బాలికల పాఠశాల, రెసిడెన్షియల్ పాఠశాల, రెసిడెన్షియల్ కళాశాల, ఏజెన్సీ లక్ష్మీపురం జూనియర్ కళాశాలలో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26న డిగ్రీ విద్యార్థులకు మానవత్వం పెంపొందించుట విద్యావశ్యకత, 27న ఇంటర్ విద్యార్థులకు ప్రకృతియే ఉత్తమ గురువు, 29న 8, 9, 10 తరగతుల హైస్కూళ్ల విద్యార్థులకు ఆచార్యదేవోభవ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారని వివరించారు. పోటీల్లో విజేతలకు వచ్చే నెల 15, 25, నవంబర్ 5 తేదీలలో ఫలితాలు ప్రకటించి విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లను అందజేస్తామన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం, సేద్య విభాగ శాస్త్రవేత్త వి.ప్రసాద్‌రావు సూచించారు. మండలంలోని డొంకాడ గొడిచెర్లలో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వరి పొలాలను పరిశీలించారు.మండలం లో 32 శాతం వర్ష పాతం లోటు ఉందని, దీంతో 30 శాతం మాత్రమే వరి ఉడుపులు అయ్యాయన్నారు. ఈ పరిస్థితిలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ , విశాఖపట్నం ఆత్మా సహకారంతో వర్షాభావ పరిస్థితులలో ప్రత్యామ్నాయ పంటల సాగు -యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు.జిల్లా వనరుల కార్యాలయం అధికారి విజేత వరి లో ప్రస్తుత పరిస్థితిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. 45 నుండి 60 రోజుల ముదురు నారు నాట్లు వేసినప్పుడు మొనలు దగ్గరగా(44 చ మి) నాటాలని, ఎరువులు 20 శాతం అదనంగా వేయాలని తెలియజేశారు. నారు మడులు ఎండినా, నీటి సదుపాయం ఉన్నట్లయితే తక్కువ కాల పరిమితి గల ఎం టి యు - 1224 లేదా ఎం టి యు - 1121 ను వేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, కలుపు నివారణ చర్యలను, పురుగు తెగుళ్ల యాజమాన్యం గురించి తెలియజేశారు. వర్షాధార మెట్ట ప్రాంతాలలో మినుము, రాగి వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తులసి, గ్రామ వ్యవసాయ సహాయకులు, 32 మంది అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

తాగునీరు వృథా

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం కొంగసింగి గ్రామానికి వెళ్లే రహదారిలో చోద్యం నుంచి వచ్చే మంచినీటి పైపులైన్‌కు రంధ్రం పడింది. గత మూడు రోజులుగా నీరు వృథాగా పోతుంది. పైపులైన్ బాగు చేయాలని గ్రామస్తులు, పాదచారులు కోరుతున్నారు.





శంకుస్థాపన చేస్తున్న హెటిరో కంపెనీ ప్రతినిధులు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో హెటిరో ఆర్థిక సాయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శనివారం రోడ్డు నిర్మాణ పనులకు కంపెనీ ప్రతినిధులు కుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు 70 లక్షలతో 2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి సిహెచ్ శ్రీనివాసరావు ,గ్రామస్తులు కోదండరావు, రాంబాబు, తాతీలు, గంగరాజు, నాగేష్, కాశీ పాల్గొన్నారు .



అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు

తీరంలో పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రపంచ తీర శుభ్రత దినోత్స వంలో భాగంగా మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట సముద్ర తీరంలో శనివారం ఉదయం తలపెట్టిన స్వచ్ఛ సాగర్ - సురక్షిత సాగర్‌లో అందరూ పాల్గొనాలని సర్పంచ్ అప్పలనరస, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ కోరారు. శుక్రవారం ఈ కార్యక్రమంపై గ్రామంలో అవగాహన కల్పించారు. రాజయ్యపేట సముద్ర తీరంలో చెత్త, ప్లాస్టిక్, పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థ పదార్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసుపల్లి శివ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెచ్‌టెక్ హానర్ 90 ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సౌకర్యవంతమైన వ్యూయింగ్, క్రియేటివ్ ఫ్రీడం కోసం కొత్త ప్రమాణాలు కలిగిన హెచ్‌టెక్ హానర్ 90 5జిని ఆవిష్కరించినట్టు ఆ సంస్థ సిఇఒ మాధవ్ షేత్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎఐ (వ్లాగ్) మాస్టర్, 3840 హెచ్‌డి పిడబ్ల్యు డిమ్మింగ్ టెక్నాలజీతో ఇండస్ట్రీ-లీడింగ్ క్వాడ్-కర్వ్ ఫ్లోటింగ్ డిస్‌ప్లే ఫీచర్‌తో కూడిన అద్భుతమైన 200 ఎంపి ప్రధాన కెమెరాతో హానర్ 90 5జి లభిస్తుందన్నారు.

ఇంటర్ సెల్ మెంటరింగ్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల కోసం ఇంటర్ సెల్‌తో మెంటరింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిందని నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ పునీత్ కొతపా తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. కెరీర్ డెవలప్‌మెంట్‌లో నారాయణ ముందంజలో ఉందన్నారు.